




# ఎన్నికలలోయ్... అన్నీ కులాలే- బాబోయ్

అమెరికాకమ్మ కథలు- 4

మీ సంగతి నాకు తెలియదు కానీ, మా ఇంట్లో ఆర్ధిక సిద్ధాంతం అందరిలాగా అర్ధం, పర్ధం లేకుండా ఉండదు. ఆంధ్రాలో ఎన్నికల లాగా అంతా ఒక పద్ధతి ప్రకారమే జరుగుతుంది. ఉదాహరణకి గత ఫిబ్రవరి నెల 14-15-16 తేదీలలో లో రెండవ ప్రపంచ సాహితీ సదస్సు దిగ్విజయంగా జరిగింది కదా! అలాగే నా జీవిత ధ్యేయం అయిన "20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంథం" కూడా కేవలం ఒక నెల ఆలస్యంగా అయినా మొత్తానికి ప్రచురించబడి, గొప్ప కథా రచయిత శ్రీ కాళీపట్నం రామారావు గారి చేత మార్చి 11న ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమాలన్నింటికీ కలిపి నేను అమెరికాలో ఎన్ని గుంజీలు తీయాలో నేను కాకినాడ వెళ్ళి, సరిగ్గా నేను పుట్టిన "పురిటి గడ్డ" మీద నా ల్యాపుటాపు కంప్యూటర్ నిజంగానే నా రెండు ల్యాపుల...అనగా తొడల టాపులో పెట్టుకుని లెక్కలు కట్టుకున్నాను. అన్నట్టు, కాకినాడ గాంధీనగరంలో కట్టబడిన మొట్టమొదటి పెంకుటిల్లు మా తాత గారు 1921లో కట్టించారు. రెండేళ్ళ తరవాత నెహ్రూ గారూ మొదలైన ప్రముఖులు మా ఇంటికి వారం రోజులు భోజనానికి వచ్చారు. ఎందుకంటే మా ఇల్లూ, ఇంచుమించు ఎకరం స్థలమూ 1923లో జరిగిన కాకినాడ కాంగ్రెస్ మహా సభలకి భోజనాల హాలు. మా ఇంటికి వంద అడుగుల దూరంలో ఉన్న ఇప్పటి గాంధీనగరం పార్కు ఆ సభలకి నిర్వాహణ వేదిక.

నేను పుట్టి పెరిగిన ఆ ఇంటిని మా పెద్దలు ఈ మధ్యనే నా "పురిటి గది" తో సహా కూల్చేసి, నా "పురిటి గడ్డ" ని ఏమీ చెయ్యలేక ఖాళీ స్థలం మిగిల్చారు. గొప్పవాళ్ళు పుట్టిన ఇళ్ళు పడగొట్టెయ్యడం మనవాళ్ళకి అలవాటేగా! అందుచేత, చేసేది ఏమీలేక ఆ ఖాళీ స్థలంలో నేను ఒక ఎర్ర రంగు ప్లాస్టిక్ కుర్చీ వేసుకుని రెండవ ప్రపంచ సాహితీ సదస్సు మరియు పుస్తక ప్రచురణ తాలూకు - ఆదాయం-వ్యయం లెక్కలు వేసుకున్నాను. దాని ప్రకారం నేను అమెరికా వెళ్ళగానే రోజుకి వంద లెక్కన మూడు నెలల 4 రోజుల పాటు హాయిగా గుంజీలు తీసుకుంటూ నా కొలెస్ట్రాల్ తగ్గించుకోవచ్చును.

మా ఇంట్లో ఆర్ధిక సిద్ధాంతం అందరిలాగా అర్ధం, పర్ధం లేకుండా ఉండదూ, ఆంధ్రాలో ఎన్నికల లాగా అంతా ఒక పద్ధతి ప్రకారమే జరుగుతుంది అని చెప్పానుగా. ఆ మహత్తర సిద్ధాంతం పేరు "డాలర్ కి ఒక గుంజీ". ప్రతి పదార్ధం ఏమిటంటే నేను నా

సాహిత్య సేవలో ఎప్పుడు డబ్బు నష్టపోయినా "డాలర్ కి ఒక గుంజీ" చొప్పున శిక్ష అనుభవించాలి. చిన్న కన్సెషన్ ఏమిటంటే, రోజుకి వంద గుంజీలు దాటక్కర లేదు. గత నెల నా సాహిత్య గోరోజనం తాలూకు ఆదాయం 3200.93 డాలర్లు -వ్యయం 12600.74 డాలర్లు, వెరసి నష్టం 9399.81 డాలర్లు. ఇప్పుడు నేను 9400 గుంజీలు తీయుటకు ఎన్నాళ్ళు పడుతుందో మీరే లెక్కలు వేసుకోండి. కనీసం ఈ సారైనా కొన్ని ఏదైన 50-50 ఛాన్సు ఉందేమో కనుక్కోవాలి. ఎందుకంటే మా క్వీన్ విక్టోరియా మాంచి మంచి మూడ్‌లో ఉంటే, సగం గంటలు గోడ కుర్చీ వేయుటకు, లేదా మూల నుంచోడానికి ఆవిడ ఒప్పుకుంటుంది.. (ఈ గోడ కుర్చీ మరియు నుంచొనుట ఆవిడ కాదు..నేనూ... )

ఒక వేళ పొరపాటున ఆదాయం 2-వ్యయం 1 అయినట్లయితే, మా క్వీన్ విక్టోరియా కూడా అదే పద్ధతి ప్రకారం నా సమక్షంలో గుంజీలు తీయవలయును. గత 32 సంవత్సరాలగా ఆవిడ గుంజీలు ఏ విధంగా తీయునో చూడాలని నాకు చాలా కోరికగా ఉన్నది కానీ ఆ అవకాశం కనుచూపు మేరలో కనిపించుట లేదు. నా కొలెస్ట్రాల్ మటుకు గొప్ప కంట్రోల్‌లో ఉందని మా డాక్టర్ గ్రీడ్ గారు చాలా విచారపడుతూ ఉంటాడు.

ఈ గుంజీ లెక్కలు చూడగానే నాకు భయం వేసి 1922లో పాతిన మా మామిడి చెట్టు కేసి చూడగానే, ఒక బ్రిలియంట్ ఐడియా వచ్చి, అర్జంటుగా క్వీన్ గారికి ఫోన్ చేశాను. "అది కాదూ, నేను ఇంకా ఇండియాలో చాలా రోజులు ఉంటాను కదా. నా శిక్ష ఎంచక్కా ఇక్కడే అనుభవించవచ్చుగా . కావాలంటే రోజుకి రెండు వందల గుంజీలు తీయుదును. సాక్ష్యం కావాలంటే సర్టిఫికేట్లు ఎన్ని కావాలంటే అన్ని పట్టుకొస్తాను. చూసుకో. " అని ప్రపోజలు పెట్టాను. "అమ్మా ఆశ. నా చెవిలో కాలీ ఫ్లవరు పెట్టకు. ఇలాటి వాటికి నువ్వు ఉస్మానియా యూనివర్శిటీ నుంచి కూడా సర్టిఫికేట్ తేగలవు. ఫర్గెటిట్" అని సహజసిద్ధమైన "స్టోను" లో సమాధానం చెప్పింది మా క్వీన్ విక్టోరియా.

నా బ్రిలియంట్ ప్లాను పనిచెయ్యలేదే అని ల్యాపుటాపు టాపు మూసేసి విచారంగా ఉండగా, హఠాత్తుగా మా వెనకాల వీధిలోంచి జిందాబాద్, ముర్దాబాద్, వర్ధిల్లాలి, నశించాలి, పాడిచెయ్యాలి, నరికెయ్యాలి, గర్జించాలి, ఘోషించాలి, నిర్మూలించాలి, చంపెయ్యాలి, బతకన్యాడదు, బతకాలి మొదలైన అద్భుత నినాదాలతో ఒక రాజకీయ ఊరేగింపు జరుగుతోంది. గోడ మీదనుంచి తొంగి చూస్తే ముందు ఒక పెద్ద లారీలో ఒక నాయకుడూ, పక్కనా, ముందూ, వెనకా, చెట్ల మీదా, మేడల మీదా తెలుగు వెకిలి నవ్వుల సమూహం, ఒకే రంగు కండువా సైన్యం, కొన్ని వందల జండాల రెపరెపలతో దూసుకు పోతూ, మన ప్రజాస్వామ్య వ్యవస్థని పరిరక్షిస్తోంది.

అది చూడగానే గత నాలుగు వారాలలో నన్ను ఎంతో బాధించినా, ఏడవ లేక నవ్వించిన హైదరాబాదు నగరం జ్ఞాపకం వచ్చింది. మహా నగరంలో " ఏ రోడ్డు మూల చూసినా, ఏమున్నది గర్వకారణం. నా కుల సంక్షేమమే ప్రజాస్వామ్యం, నీ కులాధిపత్యమే నిరంకుశం" అనే అర్థాలు వచ్చే కొన్ని వేల ప్రకటనలు, బిల్ బోర్డులూ, కటౌట్‌లూ, ఒకటేమిటి, ఇంటా, బయటా ఎక్కడ చూసినా కులం వాసనే. ప్రజాస్వామ్యం పేరుతో చవక బారు సెంటు వ్రాసే గబ్బు కంపే.

ఉదాహరణకి, నేను వెళ్ళిన కొందరి ఇళ్ళలో, వారి, వారి డ్రాయింగ్ రూం బల్లల మీద దర్జాగా తెరిచి, పరిచిన కొన్ని రంగు, రంగుల పత్రికల పేర్లు "కమ్మ వైభవం, వెలమ వైజయంతి, రెడ్డి సౌభాగ్యం, మాదిగ గర్జన,, నాయీ బ్రాహ్మల నాదం, బ్రాహ్మణ గోడు, ...ఒకటేమిటి ఇలాటి పత్రికలెన్నో.... అఫ్‌కోర్స్, వీటి సరి అయిన పేర్లు అన్నీ నాకు జ్ఞాపకం లేదు కానీ విషయం ఒకటే. పైగా ఇవన్నీ మార్కెట్లో దొరుకుతాయి అనుకోను. మీరు కుల సంఘాలలో సభ్యత్వం తీసుకోవాలేమో అని నా అనుమానం. నాకు అందుబాటులోకి

వచ్చిన ఈ పత్రికలన్నింటినీ చదివితే నాకు తెలిసిన విషయం ఏమిటంటే ఏదో ఎవరి కులాల వారి చంకలు వారే గుద్దుకున్నారు కానీ, ఇతరులని కించపరచడం కానీ, నిందించడం కానీ నా దృష్టిలోకి రాలేదు.

ఇక ప్రతీ రోజూ ఎక్కడో అక్కడ " గౌడ గర్జన, మాల మహానాడు, "కాపు సంఘం మహాసభ", "మాదిగ డీలక్స్ గర్జన", "వెలమ వారి కార్తీక పౌర్ణమి ఉత్సవాలు", బ్రాహ్మల తద్దినోత్సవాలు, మాదిగ బహిష్కరణ, మాల తిరస్కరణ, గంగపుత్రుల గోల, మొదలైన రక రకాల మకుటాలతో, రకరకాల రాజకీయ పరమైన సభలు జరుగుతూనే ఉన్నాయి. ఎక్కడనుంచి వస్తారో, ఎలా వస్తారో తెలియదు కానీ అన్ని సభలకీ వేలాది మంది వస్తూనే ఉంటారు. ఈ సమావేశాల వేటికీ నేను వెళ్ళలేదు కాబట్టి, వాటి వివరాలు తెలియవు . ఎప్పుడైనా టీవీ వార్తలలో చూసినా ఆ భాష నాకు అర్ధమయి చావదు.

అమెరికా కోణం లోంచి చూసినా, అంధ్రా కోణంలోంచి చూసినా,  నా బ్రిలియంట్ బుర్ర ఉపయోగించి నేను గమనించిన విషయం ఏమిటంటే ఆంధ్రాలో ఎన్నికలన్నీ మా ఇంట్లో ఆర్ధిక సిద్ధాంతం లాగా ఒక పద్ధతి ప్రకారం జరుగుతాయి. ఆ "అతి రహస్యమైన"  పద్ధతి పేరు "కులానికే ఓటు". నా మాట అబద్ధం అని ఎవరైనా ఋజువు చెయ్యగలిగితే...అవును....గంటకి ఒక గుంజీ చొప్పున బతికున్నంత కాలం కొలెస్ట్రాల్ తగ్గించుకుంటాను....అఫ్ టుకోర్స్... మూడు నెలల 4 రోజుల సుప్రీం కోర్ట్ శిక్ష తరవాతే అనుకోండి. ప్రజలంతా ఇది వరకటి ఎన్నికలలో లాగానే  తెలివి తేటలుగా ఇచ్చే డబ్బు పుచ్చేసుకుని, అందిన సారా తాగేసి, ఓటు వేసే సమయానికి సరి అయిన నిర్ణయాలు తీసుకుని ఈ కులం ప్రసక్తి పట్టించుకోకుండా, నాకు శిక్ష తప్పిస్తారు అని నా ఆశ.

అన్నట్టు, నా పురిటి గడ్డ మీద కూచుని, ఒక స్నేహితుడి ఫోన్ నెంబర్ కోసం కాకినాడ సిటీ ఫోన్ డైరెక్టరీలో వెతుకుతూ ఉండగా ఆఖరిపేజీలు చూసి ఆశ్చర్య పోయాను. అందులో ఎందుకో తెలియదు కానీ, బీసీ కులాల లిస్టు, అలాగే ఎస్సీ, ఎస్టీ లాటి పేర్ల కింద మరి కొన్నీ వెరసి కొన్ని వందల కులాల పేర్లు నమోదు చెయ్యబడ్డాయి. అందులో నేను గుర్తు పట్టినవి పదిలోపునే ఉన్నాయి. ఫోన్ నెంబర్లు ఇవ్వాల్సిన ఈ గవర్నమెంటు ప్రచురణలో ఈ కులాల లిస్ట్, నా బోటి అజ్ఞానులకి జ్ఞానోదయం కలిగించాలనే సర్కారు వారి ఉద్దేశ్యం అయి ఉంటుంది. ఆంధ్రదేశమంతటా  కుల సంస్కారం వెల్లివిరుస్తోంది అనడానికి ఇది మరొక ఉదాహరణ.   మీకేమన్నా అనుమానమా?